క్లుప్తంగా

బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా అంతర్ పాఠశాలల బాస్కెట్‌బాల్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ 23న నగరంలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, బాస్కెట్‌బాల్ ప్రతినిధులు ప్రతాప్, ఆలీ పాల్గొన్నారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు కృషి చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ చంద్రప్ప కోరారు. మంగళవారం ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి తుగ్గలి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించారు. ఈనెల 19 నుంచి కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో బృందంలోని అధికారులను కలిసి తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఏఎస్ఏ జిల్లా కార్యదర్శి మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, మాజీ డీవీఎంసీ సభ్యులు కాటం ఏసు ఉన్నారు.

చదరంగం సాధనతోనే మేధాశక్తి పెంపు



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రమం తప్పకుండా చదరంగం సాధన చేస్తే మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన డీఎస్‌డీవో మాట్లాడుతూ నిత్యం ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు క్రీడల వల్ల ఎంతో ఉపశమనం పొందవచ్చన్నారు. ప్రతిఒక్కరూ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు.

విద్యార్థి కిట్ల పంపిణీ



విద్యార్థినికి కిట్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు సిటీ: మండల పరిధిలోని పసుపుల ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సకాలంలో ప్రతి విద్యార్థికి విద్యార్థి కిట్లను అందజేయాలని అధికారులకు సూచించారు. ఎంఈఓ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

కర్నూలు(సెంట్రల్): ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బిర్లాగడ్డ హమాలీ యూనియన్ నాయకుడు ఎం.మౌలాలి కుటుంబాన్ని సీఐటీయూ నాయకులు పరామర్శించారు. మంగళవారం సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా ఆధ్వర్యంలోని బృందం వారి ఇంటికి వెళ్లి భార్య, పిల్లలను పరామర్శించారు. మౌలాలి లేని లోటు తీరనిదని, ఆయన 30 ఏళ్ల పాటు హమాలీ వర్కర యూనియన్‌లో పనిచేశారని కొనియాడారు. ప్రభుత్వం మౌలాలి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కాగా కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. నాయకులు రవి, మధు, బాషా, నాగన్న, సూర్యరాజు, నాగరాజు, చిన్న మౌలాలి, జగదీష్ పాల్గొన్నారు.

టమాట పంపిణీకి చర్యలు


కర్నూలు (అగ్రికల్చర్): స్థానిక సి.క్యాంప్ రైతుబజార్‌లో టమాట పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో ధర రూ.70 నుంచి రూ.80 వరకు ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో మదనపల్లి నుంచి టమాట కొనుగోలు చేసి సి.క్యాంప్ రైతుబజార్‌లో వినియోగదారులకు నోలాస్.. నోగెయిన్ కింద పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు ధర, రవాణా, హమాలీ చార్జీలు కలిపి లాభనష్టాలు లేకుండా పంపిణీ చేయడమే నోలాస్ నోగెయిన్ ఉద్దేశమన్నారు.

సికిల్ సెల్‌తో.. చిక్కి శల్యం


- చిన్నారులకు అరుదైన వ్యాధి
- రక్త కణాల్లో అడ్డంకులు
- పలు రకాల అనారోగ్య సమస్యలు
- పెన్షన్‌తో ఆదుకున్న గత ప్రభుత్వం
- నేడు జాతీయ సికిల్ సెల్ వ్యాధి దినం

అభం శుభం తెలియని చిన్నారులను అరుదైన వ్యాధి పట్టిపీడిస్తోంది. పుట్టుకతోనే వారికి సోకిన ఈ వ్యాధి జీవితాంతం వెంటాడుతోంది. శరీరానికి అవసరమైన రక్తాన్ని అందకుండా చేసి ఒక్కో అవయవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫలితంగా ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారులు కుప్పకూలిపోతున్నారు. ఏ పనీ చేతగాక చిక్కిశల్యమవుతున్నార. ఇలాంటి వారికి గత ప్రభుత్వం రూ.10 వేల పెన్షన్ ఇచ్చి ఆదుకుంది. – కర్నూలు(హాస్పిటల్)

మనిషిలో సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయి. రక్తనాళాల ద్వారా ఈ కణాలు శరీరమంతా ప్రయాణించి వివిధ అవయవాలకు ఆక్సీజన్‌ను సరఫరా చేస్తాయి. కొంత మందిలో జన్యుపర కారణాల వల్ల ఎర్ర రక్త కణాలు గుండ్రంగా గాకుండా కొడవలి ఆకారంలోకి మార్పు చెంది ఉంటాయి. దీనినే సికిల్ సెల్ వ్యాధిగా వైద్యులు పిలుస్తారు. ఈ వ్యాధి ఉన్న వారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్‌సెల్‌గా, మరొకటి మామూలుగా ఉంటే అలాంటి వారిని సికిల్‌సెల్ క్యారియర్లు ఉంటారు. వీరికి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే వారికి జన్మించే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రక్తకణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్ రక్తకణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. ఇవి నశించి పోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారు. సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సీజన్ అందడం తగ్గిపోతుంది. ఈ వ్యాధిగ్రస్తులు తగిన చికిత్స తీసుకోకపోతే 15 ఏళ్లలోపు మరణించే అవకాశం ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 27 మంది ఉన్నట్లు సమాచారం. ఇంకా రిజిస్టర్ కాని పిల్లలు మరో 15 మంది దాకా ఉండొచ్చని అంచనా. ఇలాంటి అరుదైన వ్యాధి ఉన్న వారికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి నెలా రూ.10వేల ప్రత్యేక పెన్షన్ ఇచ్చి ఆదుకున్నారు.



గుండ్రంగా ఉన్న సాధారణ ఎర్ర రక్తకణాలు



సికిల్ సెల్(కొడవలి) ఎర్ర రక్తకణాలు

సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు

- దీర్ఘకాలంపాటు కామెర్లు ఉంటాయి
- రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతుల వేళ్లు వాపుతో వంపు తిరిగి ఉండటం, ప్లీహం వాచిపోయి ఉండటం, నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- శిశువుకు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్దీ లక్షణాలు కనిపిస్తాయి.
- ఆక్సీజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతూ ఉంటారు.

వ్యాధినిర్ధారణ పరీక్ష

ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక రక్తపరీక్ష ఖరీదు చాలా తక్కువలోనే ఉంటుంది. రక్తనమూనాను సోడియం మెటాబైసల్ఫేట్‌లో కలిపి మైక్రోస్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా..?, వంపు తిరిగి ఉన్నాయా తెలుసుకోవచ్చు. తద్వారా ఆ వ్యక్తికి సికిల్‌సెల్ వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. జన్యుపరమైన ఈ వ్యాధికి ఇప్పటి వరకు మందు లేదు. సికిల్‌సెల్ క్యారియర్లుగా గుర్తించి, వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు.

“బోన్ మ్యారో మార్పిడి ఒక్కటే పరిష్కారం



సికిల్ సెల్ జబ్బు వంశపారంపర్యంగా వస్తుంది. ఇద్దరు దంపతులకు సికిల్‌సెల్ వ్యాధి ఉంటే వారికి జన్మించబోయే పిల్లలకూ ఈ వ్యాధి వస్తుంది. కొడవలి ఆకారంలో ఉండే రక్తకణాల వల్ల శరీరంలో రక్తసరఫరా సరిగ్గా జరగక ఇబ్బందులు వస్తాయి. రక్తనాళాల్లో విపరీతమైన నొప్పులు, వాంతులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి వారికి ఫ్లూయిడ్స్ ఎక్కించి అవసరమైన మందులు అందజేస్తాం. వైద్యులు సూచించిన మేరకు రెగ్యులర్‌గా ఈ వ్యాధికి మందులు వాడాలి. బోన్ మ్యారో మార్పిడి శస్త్రచికిత్స చేస్తే పూర్తిగా నయం అయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

తల్లిదండ్రులకు ఉంటే బిడ్డకు వచ్చే అవకాశం



సికిల్‌సెల్ వ్యాధి తల్లిదండ్రుల్లో ఇద్దరికీ ఉంటే వారికి జన్మించబోయే బిడ్డకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భం దాల్చక ముందే బిడ్డకు రాకుండా తల్లికి ఫోలిక్‌యాసిడ్ మాత్రలు ఇస్తాం. గర్భం దాల్చాక వస్తే బిడ్డకు వచ్చే అవకాశం ఉందా అని తెలుసుకోవడానికి ఉమ్మనీరు పరీక్షకు పంపిస్తాం. ప్రసవం తర్వాత బిడ్డకు అవసరమైన పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తాం. ఒకవేళ వ్యాధి ఉంటే అవసరమైన చికిత్స అందిస్తాం. గర్భిణిగా ఉన్నప్పుడు సికిల్‌సెల్ ఉంటే ఆమెకు నెలలు నిండకముందే బిడ్డ పుట్టే అవకాశం ఉంది. బిడ్డ కూడా బరువు తక్కువగా జన్మించే అవకాశం ఉంది. కొన్నిసార్లు అబార్షన్ అయ్యే ప్రమాదం ఉంది.

– డాక్టర్ పి.శిరీషారెడ్డి, గైనకాలజిస్టు, కర్నూలు

వృక్షాలను రక్షించండి

కర్నూలు కల్చరల్: వృక్షాలను రక్షించాలని పలువురు నాయకులు మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామలకు వినతి పత్రం అందజేశారు. బీక్యాంప్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ, వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల వసతి గృహ ఆవరణలో ఉన్న కొన్ని వృక్షాలను నరికించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఎఫ్ఓ దృష్టికి తీసుకొచ్చారు. డీవీఎంసీ సభ్యులు చిటికెల శామ్యూల్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రప్ప, మాల విద్యార్థి సంఘం అధ్యక్షులు వెంకటేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు రాజీవ్ కుమార్, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాగేంద్ర తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

సెక్యూరిటీ గార్డులకు జీతాలిప్పించాలి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాస్పత్రి సెక్యూరిటీ గార్డులకు బకాయిపడిన మూడు నెలల జీతాలు ఇప్పించాలని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖరప్ప మంగళవారం వినతి పత్రం సమర్పించారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సెక్యూరిటీ గార్డులు కుటుంబ పోషణ, పిల్లల చదువు, ఇంటి అద్దె చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి జీతాలు ఇచ్చేలా చూడాలని కోరారు. అంతకుముందు సూపరింటెండెంట్ కార్యాలయం ముందు సెక్యూరిటీ గార్డులు బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి టి. రామాంజనేయులు, ప్రణీత్, వెంకటరాముడు, భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం యోగా చేయాలి

- రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి



యోగాసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు (టౌన్): ఆధునిక జీవితంలో ఆరోగ్యం కోసం ప్రతిరోజు విద్యార్థులు యోగా సాధన చేయాలని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా యోగా సంఘం, క్రీడా భారతి కర్నూలు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ యోగా సంఘం ఆధ్వర్యంలో యోగా క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా నుంచి ఇప్పటికే 10 మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి, వంద మందికి పైగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా యోగా సంఘం ప్రతినిధులు అవినాష్, అశోక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శశిధర్, సురేష్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల అనుమతి పత్రాలు తనిఖీ చేయాలి

కర్నూలు సిటీ: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అనుమతి పత్రాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్, సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ల రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర నాయుడు, శివప్రసాద్ మంగళవారం డీఈఓ కాగిత శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు.. ఒక చోట అనుమతి పొంది బ్రాంచ్‌ల పేరుతో పలు చోట్ల విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. రూ.వేలకు రూ.వేలు ఫీజు వసూలు చేస్తున్నా విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడం లేదని, తనిఖీలు నిర్వహించి అలాంటి విద్యాసంస్థలను మూసేయాలని కోరారు. డీఈఓకు వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు మధుకుమార్, దివాకర్ ఉన్నారు.

గోహంతకులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: గో హంతకులపై చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని వర్గాలు గోవులను వధిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం గోవధ జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇలాగే వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, అనేక ధార్మిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు, పోలీస్ అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం దారుణమన్నారు. అక్రమ గో రవాణాను అడ్డుకోవాల్సిన రవాణా శాఖ, అక్రమ వధ శాలలను మూసి వేయాల్సిన పురపాలక శాఖ పశుసంవర్ధక శాఖ, వీటన్నింటిని సమన్వయం చేయాల్సిన రెవెన్యూ శాఖ ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో గోవధ జరగకుండా ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదరిశ భానుప్రకాష్, నగర అధ్యక్షులు టి.సి. మద్దిలేటి, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, బజరంగ్ దళ్ సాప్తాహిక్‌మిలన్ కన్వీనర్ సాయిరామ్, నాయకులు సత్తివేలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



బోనాలతో ప్రదర్శనగా వస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులు సిరిసంపదలతో అభివృద్ధి చెందాలని కోరుతూ మహిళలు పెద్ద ఎత్తున సుంకులా పరమేశ్వరీ అమ్మవారికి బోనాలు సమర్పించారు. మంగళవారం ఓల్డ్‌సిటీలోని సాయి బాబా సంజీవ నగర్ కాలనీ వాసులు అత్యంత వైభవంగా అమ్మవారికి బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు గోవింద్ స్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయరహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు హైవే సిబ్బంది తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన ప్రసాద్ వ్యక్తిగత పనినిమిత్తం కర్నూలుకు వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంపై నంద్యాలకు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలోని తమ్మరాజుపల్లె వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఆదోని అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో అమరావతినగర్‌కు వెళ్లే రహదారిలో ఓ చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (45) మంగళవారం మృతిచెందారు. దీనిపై స్థానికులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా మృతి చెందిన వ్యక్తి ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసింది. అతని సొంత వివరాలు తెలియరాలేదు. పెద్దల సమక్షంలో పంచనామా చేసి మున్సిపల్ అధికారులకు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

22న ఆలయ భూములకు వేలం

పాణ్యం: దేవదాయశాఖ పరిధిలోని వ్యవసాయ భూములకు ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ సువర్ణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ. 2 వేలు దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

రెవెన్యూ డే వేడుకల నిర్వహణకు ఆదేశాలివ్వండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 20న జిల్లాలో రెవెన్యూ డే వేడుకల నిర్వహణకు ఆదేశాలివ్వాలని జేసీ నారపురెడ్డి మౌర్యను ఏపీఆర్ఎస్ఏ నాయకులు కోరారు. మంగళవారం జేసీని ఆమె చాంబరులో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలోని సభ్యులు కలిసి రెవెన్యూ డే వేడుకల నిర్వహణ కోసం వినతి పత్రం సమర్పించారు. అందుకు ఆమె స్పందించి రెవెన్యూ డే వేడుకల నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆదేశించినట్లు వారు తెలిపారు. జేసీని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజు, కోశాధికారి వేణుగోపాల్, నాయకులు లోకేష్‌రెడ్డి, సుధాకర్, కృష్ణుడు, ప్రకాష్‌బాబు, సందీప్ నాయక్, సునీల్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- పర్యాటక శాఖ ఆర్‌డీ అండ్ ఈడీ వెంకటేశ్వర్లు



పనులను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ ఆర్‌డీ అండ్ ఈడీ వెంకటేశ్వర్లు

కర్నూలు కల్చరల్: పర్యాటక శాఖలో చేపడుతున్న ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆ శాఖ ఆర్‌డీ అండ్ ఈడీ ఎస్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం వీఆర్ కాలనీలోని పున్నమి రెస్టారెంట్, హరిత హోటల్‌లో చేపడుతున్న ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. కర్నూలు యూనిట్‌లో రూ.6 కోట్లతో చేపడుతున్న ఆధునీకరణ పనులు, నూతన గదుల నిర్మాణం, బార్ అండ్ రెస్టారెంట్ రెనోవేషన్, కాన్ఫరెన్స్ హాల్ ఆధునీకరణ, ల్యాండ్ స్కేపింగ్ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. కస్టమర్లు పెరిగేలా, పర్యాటకులు ఆకర్షితులు అయ్యేలా ఆధునీకరణ పనులు చేయాలన్నారు. టూరిజం శాఖ డీవీఎమ్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఈఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల బాహా .. బాహీ

డోన్: ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కార్యక్రమం వేదికగా తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. చెప్పులతో పరస్పర దాడులకు తెగబడ్డారు. డోన్ ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను మంగళవారం ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి ప్రారంభించగా ఈ కార్యక్రమానికి వచ్చిన టీడీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. మండల పరిధిలోని వెంకటాపురం, బొంతిరాళ్ల గ్రామాల టీడీపీ కార్యకర్తలు సత్యనారాయణశెట్టి, రామిరెడ్డి ఘర్షణ పడ్డారు. మాటామాటా పెరిగి పరస్పరం చెప్పులతో కొట్టుకున్నారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు ఇద్దరినీ విడిపించి పంపించేశారు.

అన్యాయంగా దాడి చేశారు..

తనపై అన్యాయంగా వెంకటాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి దాడి చేశారని బొంతిరాళ్ల గ్రామానికి చెందిన సత్యనారాయణశెట్టి విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుడిని, 70 ఏళ్ల వృద్ధుడినని కూడా చూడకుండా తనపై చెప్పులతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. తాము ఏమీ చేయలేమనే ధీమాతో కొట్టారని, ఎమ్మెల్యేతోపాటు పోలీసులు తనపై దాడికి పాల్పడిన వ్యక్తులను శిక్షించాలని కోరారు.

నగరపాలకలో అంతర్గత బదిలీలు

- పలువురికి స్థానభ్రంశం
- ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్‌గా చిన్నరాముడు
- టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్‌గా వి.సుబ్బన్న
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ భార్గవ్‌తేజ



నగరపాలక కార్యాలయం

కర్నూలు (టౌన్): నగరపాలకలో అంతర్గత బదిలీలు చేపట్టారు. వివిధ విభాగాల్లో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులు, ఇతర విభాగాల్లో ఉంటూ ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపడుతున్న ఉద్యోగులను యథాస్థానాలకు పంపించేశారు. సూపరింటెండెంట్లను మార్పు చేశారు. నగరపాలక మేనేజర్‌గా పనిచేస్తున్న చిన్నరాముడును ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్‌గా నియమించారు. 1 నుంచి 39 రెవెన్యూ వార్డులు, 52 నుంచి 69 రెవెన్యూ వార్డులు, 96 నుంచి 127 రెవెన్యూ వార్డులు అప్పగించారు. కాగా రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వీరస్వామి గత నెల 31వ తేదీన పదవీవిరమణ చెందారు. అప్పటి నుంచి కీలకమైన ఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ నగరపాలకలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి స్థానభ్రంశం కల్పిస్తూ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే ఆయా స్థానాల్లో చేరాలని ఆదేశించారు.

బదిలీ అయిన ఉద్యోగులు..

నగర పాలక టౌన్ ప్లానింగ్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.క్రిస్టఫర్ బాబును రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. టౌన్ ప్లానింగ్‌లో జి 1 గా పనిచేస్తున్న వి.సుబ్బన్నను టౌన్ ప్లానింగ్ సూపరింటెండెంట్‌గా నియమించారు.

- సీనియర్ అసిస్టెంట్ జి.ఎం.శ్రీకాంత్‌ను సి–3 క్లర్క్‌గా, అక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ఎం. శివశంకర్‌ను ఆరోగ్య శాఖ విభాగంలోని ఎఫ్–3గా బదిలీ చేశారు.
- ఎఫ్–3 గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎం.రాజును టౌన్ ప్లానింగ్ విభాగంలోని జి–1 క్లర్క్‌గా బదిలీ చేశారు.
- ఏ–6 గా పనిచేస్తున్న పి.సాధిక్ హుస్సేన్‌ను రెవెన్యూ విభాగంలోని ఏ–1కు బదిలీ చేశారు.
- ఏ–1 గా పనిచేస్తున్న పి.ఎస్.ఎస్. రాజేశ్వరరావును తిరిగి ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.
- రికార్డు అసిస్టెంట్ నవీన్‌కుమార్‌ను రెవెన్యూ విభాగంలోని ఏ–6 క్లర్క్‌గా బదిలీ చేశారు.
- రెవెన్యూ విభాగంలోనూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు అదనపు బాధ్యతలు, వార్డులు కేటాయించారు.
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.సుహేయిల్ అహమ్మద్‌కు రెవెన్యూ వార్డులు (45, 51, 81, 85), నగరపాలకకు చెందిన 5 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు కేటాయించారు.
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజుకు రెవెన్యూ వార్డులు (77, 78, 79, 80,86, 87), 7 మున్సిపల్ కాంప్లెక్స్‌లు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.మన్సూర్ బాషాకు రెవెన్యూ వార్డులు (40, 41, 42, 46, 50), మూడు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ టీ.అబ్దుల్ వాజిద్‌కు 70 నుంచి 76 వరకు, అదనంగా 51వ పేట మున్సిపల్ కాంప్లెక్స్
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ రెహిమాన్ 1 నుంచి 39 వార్డులు, 52 నుంచి 69 వరకు, అదనంగా 5 మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు
- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి.ఎం.శ్రీకాంత్‌కు 96 నుంచి 127 వార్డులు, కేఎంసీ ఫ్యూయల్ స్టేషన్ బాధ్యతలు అప్పగించారు.

జీడీపీకి సందర్శకుల తాకిడి



గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద జలకాలాడుతున్న సందర్శకులు

గోనెగండ్ల: బక్రీద్ పండుగను పురస్కరించుకొని మంగళవారం ముస్లింలు కుటుంబ సమేతంగా గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు చేరుకుని సరదాగా గడిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి కార్లు, బైక్‌లు, ఆటోలలో ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఫొటోలు దిగుతూ సందడి చేశారు. కబుర్లు చెప్పుకుంటూ ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం, వంటకాలతో బంతి భోజనం చేశారు. అనంతరం ప్రాజెక్టు గేట్లు, పరిసరాలను సందర్శించి నీటిలో జలకాలాడుతూ సరదగా గడిపారు. సందర్శకుల రాకతో ప్రాజెక్టు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పండగ వాతావరణం కనిపించింది.